## జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

**- మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు**



**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**

జిల్లా కేంద్రం కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల్లో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార– పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. రేగళ్లలో జరిగిన కార్యక్రమంలో మంత్రిని కలిసి, ఏళ్లుగా ఇళ్లస్థలాల కోసం ఎదురు చూస్తున్న జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. గతంలో రామవరం వంతెన సమీపంలో జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం 10 ఎకరాల స్థలం కేటాయించినప్పటికీ, ప్రక్రియ మధ్యలో నిలిచి పోయిందని వివరించారు. స్పందించిన మంత్రి పొంగులేటి జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్య తన దృష్టిలో ఉందని, త్వరలో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో ఇళ్ల స్థలాల సాధన కమిటీ సభ్యులు జర్నలిస్టులు కల్లోజి శ్రీనివాస్, వీరు నాయక్,నాగచంద్ర. వట్టికొండ రవి, తారక్, పాపారావు. రాజేష్. జర్నలిస్టులు. నరసింహా రావు. అశోక్. పురుషోత్తం. ఈశ్వర్. లింగయ్య. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఏరియాలో చెస్ డిపార్ట్‌మెంటల్ పోటీలు ప్రారంభం






**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**

కొత్తగూడెం ఏరియా జీఎం సీహెచ్ వెంకటరమణ ఆదేశాల మేరకు డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెస్ డిపార్ట్‌మెంటల్ పోటీలు ఆదివారం రుద్రంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని డీవైపీఎం జి. హరీష్, ఏఐటీయూసీ ప్రతినిధి ఎం. మధుకృష్ణ, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ. రజాక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జి. హరీష్ మాట్లాడుతూ చెస్ శారీరక శ్రమతో కూడిన ఆట కాదని, ప్రత్యర్థి ఆలోచనలను ముందుగానే అంచనా వేసి వ్యూహాత్మకంగా ఆడే మైండ్ గేమ్ అని అన్నారు.క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని రీజినల్, కంపెనీ స్థాయి, కోల్ ఇండియా పోటీల్లో రాణించి కొత్తగూడెం ఏరియాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ జనరల్ కెప్టెన్ రాజశేఖర్, క్రీడాకారులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల బోనస్ చెల్లించాలి

**కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకూ బోనస్ వర్తింపజేయాలి**

**మంత్రి పొంగులేటికి ఐఎఫ్‌టీయూ వినతి**



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**

2025–26 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి లాభాల వాటాను ప్రకటించి, పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా 10 శాతం లాభాల బోనస్ చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. కోల్ ట్రాన్స్ పోర్ట్‌లో పనిచేస్తున్న కార్మికులకూ లాభాల బోనస్ వర్తింప జేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం కొత్తగూడెం పర్య టనకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్. సంజీవి, మల్లికార్జున్, మారుతీరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్ పెంచాలని గత ఏడాది కాలంగా పోరాటాలు చేస్తున్నా యాజమాన్యం స్పందించలేదన్నారు. కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు ఇప్పటివరకు బోనస్ వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. సమస్యలను సింగరేణి యాజమాన్యంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

## పోడు- భూ సమస్యలను పరిష్కరిస్తాం

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**





**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**

గిరిజన ప్రాంతాల్లో పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లలో నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గిరిజన రైతుల పోడు భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, తుంబూరు దయాకర్‌రెడ్డి, కోనేరు సత్యనారాయణ, ఆళ్ల మురళి, ఊకంటి గోపాలరావు, కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, జేవీఎస్ చౌదరి, ఏనుగుల అర్జున్‌రావు, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితాకుమారి, మండె వీర హనుమంతరావు, వై. శ్రీనివాస్‌రెడ్డి, ఎం. పెద్దబాబు, లోశెట్టి నాగార్జున, రాజేంద్రప్రసాద్, మంగయ్యదొర, మంద హనుమంతు, దేవరగట్ల ప్రసాద్, భువనసుందర్‌రెడ్డి, నర్రా అజయ్‌కుమార్, నూకల రంగారావు, కవడగాని పరమేష్‌యాదవ్, పీతాంబరం, సత్యనారాయణరెడ్డి, పూణెం శ్రీనివాస్, రెడ్డెం సతీష్‌కుమార్, బత్తుల వీరయ్య, రామకోటి, బొల్లం రామయ్య, పారపర్తి భద్రయ్య, ప్రసాద్, వజ్ర రాజు తదితర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

**- టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు**






**కొత్తగూడెం, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**

విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఒలింపిక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. బాలికలు కూడా అధిక సంఖ్యలో అథ్లెటిక్స్‌లో పాల్గొనాలని కోరారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు, ప్రోత్సాహం అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహీధర్ రెడ్డి, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ మందుల వెంకటేశ్వర్లు, అథ్లెటిక్స్ కోచ్ డి. మల్లికార్జునరావు, కోచ్‌లు ఎం. నాగరాజు, పి. నాగేందర్, జె. గిరిప్రసాద్, షేక్ రియాజ్ పాషా, కిన్నెరసాని ప్రసాద్, ఐటీడీఏ అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్ నారాయణ, ఈశ్వర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రెజరర్ బి. హనుమంతరావు, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంజులాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు దసరా బోనస్ రూ.25 వేలు చెల్లించాలి



**- దసరాకు వారం రోజుల ముందే బోనస్ అందించాలి**

**: ఏఐటీయూసీ నేత యర్రగాని కృష్ణయ్య**

**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఈ ఏడాది దసరా బోనస్‌గా కనీసం రూ.25 వేలు చెల్లించి, పండుగకు వారం రోజుల ముందే అందేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు కె.డబ్ల్యూ. క్రిస్టోఫర్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ కీలకమని, గత రెండేళ్లుగా బోనస్ చెల్లిస్తున్నప్పటికీ సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో దసరాకు ఒకరోజు ముందు కాంట్రాక్టర్ల ఖాతాల్లో నగదు జమ చేయడం వల్ల బ్యాంకు సెలవులతో కార్మికులకు పండుగకు ముందే బోనస్ అందడం లేదన్నారు. ఈసారి ముందుగానే నిర్ణయం తీసుకుని వారం రోజుల ముందు చెల్లించాలని కోరారు. బోనస్ చెల్లింపులో కాంట్రాక్టర్లకు ఎదురవుతున్న సమస్యలను యాజమాన్యం పరిష్కరించి, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎం చంద్రశేఖర్, సిహెచ్ శ్రీను, కే నరసింహ, అనసూర్య, భాస్కర్,జి వెంకటేష్, లక్ష్మి , శాంత, వాసవి, వెంకన్న, శేఖర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు

## లివర్ వ్యాధులపై అప్రమత్తత అవసరం : క్లినికల్ డైరెక్టర్, కాలేయ సంబంధిత డాక్టర్ నవీన్ పోలవరపు

**- ఫ్యాటీ లివర్, హెపటైటిస్‌తో క్యాన్సర్ ప్రమాదం: పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్**

**- ముందస్తు పరీక్షలతో ప్రాణాలు కాపాడుకోవచ్చు.!**




**హనుమకొండ అక్టోబర్ 04 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ప్రపంచ వ్యాప్తంగా శర వేగంతో పెరుగుతున్న క్యాన్సర్లలో లివర్ క్యాన్సర్ ఒకటిగా మారుతోందని యశోద హాస్పిటల్ హైటెక్ సిటీకి చెందిన క్లినికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, లివర్ వ్యాధుల నిపుణుడు డాక్టర్ నవీన్ పోలవరపు, పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్ తెలిపారు. హనుమకొండలో ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం క్లినికల్ డైరెక్టర్,డాక్టర్ నవీన్ పోలవరపు మాట్లాడుతూ 'నిశ్శబ్ద హంతకులు'గా ఫ్యాటీ లివర్, హెపటైటిస్ బి, సి వైరస్ లు వస్తున్నాయని అన్నారు. అధిక మద్యపానం వల్ల లివర్ తీవ్రంగా దెబ్బతింటోందని, ముదిరి పోయే వరకు వ్యాధి లక్షణాలు బయట పడక చాలామందికి తెలియదని వారు హెచ్చరించారు. కాళ్లు వాపులు, పొట్ట ఉబ్బరం, లివర్ క్యాన్సర్ వంటి లక్షణాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తాయని వైద్యులు వెల్లడించారు. క్రమం తప్పకుండా రక్తపరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించుకోవడం ద్వారా ముందస్తుగానే వ్యాధిని గుర్తించి వ్యాక్సినేషన్, సరైన చికిత్సలతో ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని సూచించారు.కొలెస్ట్రాల్ మధుమేహం, థైరాయిడ్ సమస్యలను అదుపులో ఉంచుకోవాలని, మద్యపానం మానడం లేదా తగ్గించడం ద్వారా లివర్, ప్యాంక్రియాస్ దెబ్బతినకుండా కాపాడుకోవచ్చని వారు తెలిపారు. పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్ పెగట్రాజ్ మాట్లాడుతూ అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు పెరుగుతున్నాయని మలవిసర్జనలో మార్పులు, రక్తస్రావం, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలు రెండు వారాలకు మించి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన తెలిపారు.కొలనోస్కోపీ పరీక్ష ద్వారా పేగుల్లో ఏర్పడే పాలిప్స్‌ను తొలిదశలోనే గుర్తించి తొలగించడం వల్ల పెద్దపేగు క్యాన్సర్‌ను నివారించవచ్చని వివరించారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్.ఓ) 2030 నాటికి హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సిబ్బంది విజయ్ కుమార్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు సొంతింటి కల నెరవేర్చాలి

**- మంత్రి పొంగులేటిని కోరిన ఐఎన్‌టీయూసీ నేత ఎండీ రజాక్**



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**

సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి 250 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి సొంతింటి కలను నెరవేర్చాలని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. ఆదివారం కొత్తగూడెం పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం, రుద్రంపూర్, గౌతంపూర్, రామవరం, త్రీ ఇంక్లైన్, ఫోర్ ఇంక్లైన్, ధన్‌బాద్ ప్రాంతాల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న కార్మిక కుటుంబాల ఇళ్లను క్రమబద్ధీకరించి శాశ్వత పట్టాలు, ఇంటి నంబర్లు మంజూరు చేయాలని కోరారు. పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు, గృహ రుణాలు, బ్యాంకు సహాయం పొందలేక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. రెవెన్యూ, సింగరేణి అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి అర్హులైన కార్మిక కుటుంబాలకు ఇళ్ల స్థలాలు లేదా ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని రజాక్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబరావు, మల్లారపు కొమురయ్య, పరమేష్ యాదవ్, సుబ్రమణ్యం, లగ్గాల అజయ్, వినోద్, మహేష్, రాము, కల్లూరి సంపత్, ప్రణయ్, దిలీప్, నాయకులు, కార్యకర్తలు,మిత్రులు, శ్రేయోభిలాషులు,పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని ఘనంగా సన్మానించిన కొత్వాల దంపతులు

**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**



రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆదివారం కొత్తగూడెం నియోజకవర్గంలోని లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్ల గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, అను బంధ సంఘాల ప్రతినిధులు, కార్పొరేటర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు మంత్రిని కలిసి అభినందించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్,రాష్ట్ర మార్క్‌ఫెడ్‌మాజీ డైరెక్టర్,పాల్వంచకోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, పాతపాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు మంత్రి పొంగులేటిని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్ధ రాత్రులు కాకర్ల పాలగుట్ట కింద అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు

**పురాతన శ్రీ వేణుగోపాల స్వామి గుట్టకు ముప్పు..**

**పట్టించుకోని అధికార యంత్రాంగం**



**జూలూరుపాడు: అక్టోబర్ 04 (తెలంగాణ వాణి)**

మండల పరిధిలోని కాకర్ల గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి పురాతన పాలగుట్ట ప్రాంతంలో గుట్ట కింద అర్ధరాత్రులు అక్రమ గ్రావెల్ త్రవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో మట్టి అక్రమార్కులు గుట్ట కింద నుంచి మట్టిని తవ్వి ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా తరలిస్తున్నారని చెబుతున్నారు. పురాతన కాలం నాటి కృష్ణుడి గుట్టగా స్థానికులు ఆరాధ్య దైవంగా భావించే ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేపట్టడం వల్ల గుట్ట ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తవ్వకాలను వెంటనే అడ్డుకోవాలని వారు కోరుతున్నారు. గుట్ట కింద రాత్రివేళల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పురాతన ప్రదేశం కావడంతో అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## వాలీబాల్ క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలి

**క్రీడాకారులకు న్యాయం చేయాలి.. యువతను ప్రోత్సహించాలి**

**రేపటి పౌరుల భవిష్యత్తు కోసమే మా పోరాటం : తల్లాడ వాలీబాల్ క్లబ్**



**తల్లాడ, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి):**
నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన తల్లాడ వాలీబాల్ క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలని తల్లాడ వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులు, యువత నిరసన చేపట్టారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం సమీపంలో ఉన్న క్రీడా ప్రాంగణంలో ఐకేపీ భవన నిర్మాణ పనులు చేపట్టడాన్ని వారు వ్యతిరేకించారు.

**40 ఏళ్ల చరిత్రకు ముప్పు..**

వాలీబాల్ క్రీడా ప్రాంగణం కోసం సుమారు 40 ఏళ్ల క్రితమే స్థలాన్ని కేటాయించారని క్లబ్ సభ్యులు తెలిపారు. అప్పట్లో ఎస్పీ క్రాంతిరాణా టాటా ఈ ప్రాంగణాన్ని ప్రారంభించి ఫౌండేషన్ స్టోన్ వేశారని గుర్తుచేశారు. క్రీడా ప్రాంగణం పక్కన ఉన్న స్థలాన్ని సైతం క్రీడా అవసరాల కోసం కేటాయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో ఐకేపీ భవన నిర్మాణ పనులు చేపడుతున్నారని, వాటిని తక్షణమే నిలిపివేసి క్రీడా ప్రాంగణాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

**జాతీయ స్థాయి పోటీలకు వేదిక**

తల్లాడ వాలీబాల్ మైదానానికి ఎంతో ఘనమైన క్రీడా చరిత్ర ఉందని క్రీడాకారులు తెలిపారు. గతంలో ఈ ప్రాంగణంలో రెండు, మూడు సార్లు జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహించామని, జాతీయ వాలీబాల్ కెప్టెన్ వెంకటనారాయణ సైతం పోటీలకు హాజరయ్యారని గుర్తుచేశారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన ఎంతోమంది క్రీడాకారులు వివిధ రంగాల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవలందించారని తెలిపారు.

**"ఇది మా స్వార్థం కోసం కాదు"**

క్రీడా ప్రాంగణాన్ని కోల్పోతే యువతకు తీవ్ర నష్టం జరుగుతుందని క్లబ్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల ద్వారా యువతలో ప్రతిభ, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెంపొందుతుందని పేర్కొన్నారు. "ఈ పోరాటం మా స్వార్థం కోసం కాదు.. రేపటి పౌరుల భవిష్యత్తు కోసం. క్రీడా ప్రాంగణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోం" అని స్పష్టం చేశారు. అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ పనులను నిలిపివేసి, వాలీబాల్ క్రీడా ప్రాంగణాన్ని క్రీడాకారులకే అందుబాటులో ఉంచాలని తల్లాడ వాలీబాల్ క్లబ్ డిమాండ్ చేసింది.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**తల్లాడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన**




**తల్లాడ, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి):**
కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తల్లాడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ నిరసన చేపట్టారు. టీపీసీసీ, ఖమ్మం జిల్లా డీసీసీ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. ఎన్నికల నిర్వహణలో కేంద్ర ఎన్నికల సంఘం విఫలమైందని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల కమిటీ నాయకులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బలగాని మియాకు నివాళులర్పించిన అన్నారుగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు



**తల్లాడ. అక్టోబర్ 4 (తెలంగాణ వాణి):**
మండల పరిధిలో అన్నారుగూడెం గ్రామానికి చెందిన బలగాని మియా(55) గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అన్నారుగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారుగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి రమేష్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, అన్నారుగూడెం మాజీ విడీసీ చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్ హాజరై మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో వారి వెంట, రామారావు, గోపి గౌడ్ బలగాని దిలీప్, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు

## ఘనంగా ఉచిత కాలేయ వైద్య శిబిరం

**149 మందికి వైద్య పరీక్షలు.. 59 మందికి ఉచిత హెపటైటిస్-బి టీకాలు**

**ఖమ్మం, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**
కాలేయ సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు వైద్య పరీక్షలను ప్రోత్సహించే లక్ష్యంతో జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సునీల్ కుమార్ జంగాల (ఎం.డి., డి.ఎం.), డాక్టర్ స్వాతి జంగాల పర్యవేక్షణలో శిబిరం జరిగింది. మొత్తం 149 మందికి ఉచిత వైద్య పరీక్షలు, వైద్య సలహాలు అందించారు. అవసరమైన 90 మందికి ఉచితంగా లివర్ ఫైబ్రోస్కాన్ పరీక్షలు నిర్వహించగా, 59 మందికి హెపటైటిస్-బి నివారణకు ఉచితంగా టీకాలు వేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీకాలతో పాటు మెడికల్ కిట్లు, ల్యాబ్ సేవలను కూడా ఉచితంగా అందించారు. కాలేయ ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచుతూ, వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స పొందేలా ఫౌండేషన్ చేపట్టిన సేవలను స్థానికులు అభినందించారు.

# ఏడాదికేడాది పెరుగుతున్న పీఎల్ఆర్ బోనస్..

**- ఐదేళ్లలో బోనస్ జోష్.. రూ.76,500 నుంచి రూ.1,10,250కు**

**- బోనస్ పెరుగుదలకు కార్మిక సంఘాల ఐక్యతే బలం**

**- సింగరేణిలో లాభాల బోనస్‌పై ఎదురుచూపులు**

**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**
దేశంలోని బొగ్గు గని కార్మికుల శ్రమకు తగిన విధంగా దేశ, రాష్ట్ర ప్రభుత్వాలు గని కార్మికుల భద్రతే కాకుండా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నాయని కార్మిక సంఘాల నాయకులు, కార్మిక వర్గం హర్షం వ్యక్తం చేస్తున్నాయి. బొగ్గు పొరలను చీల్చుకుంటూ భూమి లోకి వెళ్లి తమ ప్రాణాలను లెక్కచేయకుండా బొగ్గును తవ్వుతూ దేశానికి వెలుగులు నింపుతున్న గని కార్మికుల శ్రమకు తగిన ఫలితాన్ని ప్రభుత్వాలు అమలు చేస్తు వస్తున్నాయి. భూగర్భంలో నిక్షిప్తమై ఉన్న బొగ్గును బొగ్గు పరిశ్రమల యాజమాన్యాలు నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదికతను, సాధిస్తున్న కార్మికులకు బోనస్ రూపంలో ప్రభుత్వాలు డబ్బు చెల్లించడంలో ముందున్నాయని చెప్పడంలో సందేహం లేదు. బొగ్గు గని కార్మికులకు పిఎల్ఆర్ బోనస్ ను 2022వ ఆర్థిక సంవత్సరం నుండి 2026 ఆర్థిక సంవత్సరం వరకు ప్రతి ఏడాదికేడాది కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్న కోల్ ఇండియా యాజమాన్యం పెంచుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో భారతదేశంలోని బొగ్గు గని కార్మికులకు పి ఎల్ ఆర్ బోనస్



గత 2022 వ సంవత్సరంలో 76,500/-ఇవ్వగా 2023 వ సంవత్సరంలో రు. 85000 చెల్లించడం జరిగింది. అదేవిధంగా 2024వ సంవత్సరంలో రు. 93,750/-ఇవ్వగా 2025వ సంవత్సరంలో రు.1,03,000 అందించడం జరిగింది. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం అనగా 2026 వ సంవత్సరంలో రు.1,10,250 ప్రకటించడం జరిగింది. గత మూడు సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం రూ. 7250 పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ఈ అగ్రిమెంట్ చేసిన యాజమాన్య ప్రభుత్వాలకు సహకరించినందుకు జాతీయ కార్మిక సంఘాల కృషి కి కార్మిక వర్గం కృతజ్ఞతలు తెలియజేస్తున్నాయి. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో పెద్ద పరిశ్రమగా ఉన్న సింగరేణి యాజమాన్యం కూడా ఈ ఆర్థిక సంవత్సరం కంపెనీకి వచ్చిన లాభాలను ప్రకటించాలని తద్వారా లాభాల బోనస్ కూడా ప్రకటించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అసలు సింగరేణి సంస్థకు ఈ ఆర్థిక సంవత్సరం ఎంత లాభాలు వచ్చాయో తెలపపోవడంతో కార్మిక వర్గం తలలు పట్టుకుంటున్నాయి. సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను ప్రకటించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో!ఏమిటో! అర్థం కాని పరిస్థితుల్లో జాతీయ కార్మిక సంఘాల నాయకులు సింగరేణి యాజమాన్యం ప్రకటన కోసం ఎదురుచూస్తున్నాయి.

# రాయికల్ గ్రామంలో ఘనంగా జాతీయ వన్య ప్రాణి వారోత్సవాలు



**సైదాపూర్:అక్టోబర్ 04 (తెలంగాణ వాణి)**
అటవీ శాఖ జాతీయ వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా ఆదివారం గ్రామ సర్పంచ్ చాడ అఖిల బిప్రకాష్ రెడ్డి అడవి శాఖ హుజురాబాద్ రేంజ్ ఆఫీసర్ లత సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ మరియు ఫారెస్ట్ సిబ్బంది సంయుక్తం గా రాయికల్ జలపాతం వద్ద ప్లాస్టిక్ నియంత్రణ విధానంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనైనది ఈ కార్యక్రమం లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లత మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థలు ఉపయోగం చేయడం వల్ల పర్యావరణంలో జరిగే మార్పులు వన్య ప్రాణులకి జరిగే అనర్థాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో క్యారీ బ్యాగ్స్ వన్యప్రాణులు తెలవక తినడంతో అనారోగ్యం పాలై అవి మరణించడం జరుగుతుంది పర్యావరణ సమతుల్యత లో వ్యత్యాసం జరగడం వల్ల అతివృష్టి అనావృష్టి మరియు వివిధ ఆహార గొలుసులు తేడాలు సంక్రమించి ప్రకృతి సమతుల్యతను కోల్పోతామని ప్రస్తుతం ఉన్న పారిశ్రామికీకరణలో భావితరాలకు ప్రకృతి సంపదను పర్యావరణ సంపదలను అందించలేకపోతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాయికల్ సర్పంచ్ చాడ అఖిల మాట్లాడుతూ వాతావరణంలో జరుగుతున్న మార్పులను గమనించి ఆహారం గొలుసును సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలని అది యువత చేతిలో ఉందని భావితరాలకు మన యొక్క జ్ఞాపకాలను తెలపాలని తెలియజేశారు అదేవిధంగా ఇట్టి ప్లాస్టిక్ నిర్మూలన కోసం మన రాయికల్ గ్రామపంచాయతీ నుండి మా సిబ్బంది ప్రతి వారంలో ఒక్క రోజు తప్పకుండ గురువారం ప్లాస్టిక్ వ్యర్థాలను తీసివేస్తారని అదేవిధంగా వాటర్ ఫాల్స్ దగ్గర ప్లాస్టిక్ వ్యర్థాలను విచ్చలవిడిగా పడేయకుండా వ్యర్థాలని ఒక ప్రాంతాల్లో పడేయడం కోసం రింగులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది మరియు గ్రామ పంచాయతీ తరపున ఒక సెక్యూరిటీ గార్డ్ ని ఏర్పాటు చేసి అడవి ప్రాంతంలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకొని వెళ్లకుండా జాగ్రత్తలు మెలకువలు తీసుకోవడం కోసం ఒక సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు.

రాయికల్ డైరెక్టర్ జూఅషె ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత ఆహారపు గొలుసు వన్యప్రాణుల సంరక్షణ వాటి యొక్క ఆవశ్యకత గురించి వివరించడం జరిగింది మరియు రాయికల్ వాటర్ ఫాల్స్ ని సహజ సిద్ధంగా ఏర్పడిన వాటర్ ఫాల్స్ మునుముందు అటవీశాఖ, పర్యాటకశాఖ మరియు గ్రామపంచాయతీ సంయుక్తంగా ముందుకు వెళ్లి రాయికల్ జలపాతాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామని తెలియజేయడం జరిగింది ప్రస్తుతం ఒక పదిహేను రోజులలో అడవి శాఖ లోపలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు కుక్కల సాంబ రాజు,గడిపె సందీప్, మరియు యువకులు గుంపుల మధుకర్ వేము నూరి అభిలాష్,బై రోజు రాజమౌళి, అప్పని స్వామి, కుక్కల సత్యనారాయణ, జెట్టి రాము, నేరళ్ల తిరుపతితో పాటు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు యువకులు ఉత్సాభరితంగా పాల్గొన్నారు వాటర్ ఫాల్స్ పర్యాటకులు కూడా మేము సైతం పర్యావరణ ప్రేమికులమే అంటూ నినాదాలు చేస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలను తీసివేస్తున్న క్రమం అందర్నీ కలిసివేసింది గ్రామపంచాయతీ సిబ్బంది అటవీ శాఖ సిబ్బంది అందరూ చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చిరునవ్వుల్లో బాల్యం.. జ్ఞాపకాల్లో పాఠశాల

**- తల్లాడ జెడ్పీ పాఠశాలలో 2002--03 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపురూప సమ్మేళనం**

**- ఆనాటి గురువులకు ఘన సన్మానం.. ఒక్కచోట చేరిన చిన్ననాటి స్నేహితులు**

**తల్లాడ, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి):**
కాలం గడిచింది.. చదువులు పూర్తయ్యాయి.. ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలతో ఎవరి జీవితాల్లో వారు బిజీ అయిపోయారు. కానీ చిన్ననాటి స్నేహం, పాఠశాల జ్ఞాపకాలు మాత్రం చెరిగిపోలేదు. ఏళ్ల తర్వాత అదే పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్న పూర్వ విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ గడిపిన వేళ పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా సమ్మేళనం నిర్వహించుకున్నారు. సుమారు రెండు దశాబ్దాల తర్వాత నాటి స్నేహితులు, సహాధ్యాయులు ఒకే వేదికపై కలుసుకోవడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.

**నాటి జ్ఞాపకాలు.. నేటి అనుభూతులు**

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తరగతి గదుల్లో జరిగిన సరదా సంఘటనలు, స్నేహితులతో గడిపిన క్షణాలు, అప్పటి ఆటపాటలు, గురువుల మందలింపులు, బోధనలు ఇలా ఒక్కొక్కటిగా గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. జీవితంలో ఎక్కడెక్కడ స్థిరపడ్డారో, ప్రస్తుతం ఏం చేస్తున్నారో పరస్పరం తెలుసుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు చిన్ననాటి పేర్లతో ఒకరినొకరు పిలుచుకుంటూ పాత రోజులను తలుచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వయసు పెరిగినా స్నేహబంధంలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని ఈ సమ్మేళనం చాటిచెప్పింది.




**గురువులకు గురుదక్షిణగా సన్మానం**

తమ జీవితాలకు విద్యాబుద్ధులు నేర్పి, ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసిన ఆనాటి అధ్యాపక గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కిషోర్‌బాబు, వెంకటరమణ, నిర్మల జ్యోతి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు తదితర గురువులకు జ్ఞాపికలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాల తర్వాత తమ శిష్యులందరినీ ఒకే వేదికపై చూడటం ఆనందంగా ఉందని గురువులు పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాల్లో తాము పోషించిన పాత్రను గుర్తు చేసుకుని వారు భావోద్వేగానికి లోనయ్యారు.

**చెదరని స్నేహబంధానికి ప్రతీకగా..**

పూర్వ విద్యార్థుల సమ్మేళనం కేవలం కలయికకే పరిమితం కాకుండా గురు-శిష్యుల అనుబంధానికి, చిన్ననాటి స్నేహబంధాల మాధుర్యానికి ప్రతీకగా నిలిచింది. జీవిత ప్రయాణంలో ఎన్నో మార్పులు వచ్చినా బాల్యంలోని ఆత్మీయత, పాఠశాల జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మనసులో నిలిచిపోతాయని ఈ కార్యక్రమం మరోసారి గుర్తుచేసింది. ఈ కార్యక్రమంలో 2002-03 బ్యాచ్‌కు చెందిన పలువురు పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని రోజంతా ఉత్సాహంగా గడిపారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**- మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయి**

**- సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ**

**తల్లాడ, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**
తల్లాడ మండలం పాత పినపాక గ్రామంలో సర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి స్థలం, ఇల్లు ఎంతో ముఖ్యమైన కల అని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇంటి స్థలాల పట్టాలు పొందిన ప్రతి



కుటుంబం సొంత ఇల్లు నిర్మించుకుని ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ నీరజా ప్రభాకర్, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగు నూరు లక్ష్మారెడ్డి, పాత పినపాక సర్పంచ్ గుర్రం శ్రీని వాసరావు, జిల్లా, పట్టణ, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులు మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి సన్నాహక సమావేశం

**స్థల ఎంపికపై గ్రామస్తుల అభిప్రాయ సేకరణ**



**తల్లాడ, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి):**
తల్లాడ మండలంలో అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి సన్నాహక చర్యల్లో భాగంగా ఆదివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి అనువైన స్థల ఎంపిక, భక్తులకు రాకపోకల సౌకర్యం, భవిష్యత్ అవసరాలపై చర్చించారు. అందరి సహకారంతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలని, గ్రామస్తుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని స్థలాన్ని ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించేందుకు సన్నాహక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, ఈలప్రోలు లాలయ్య, కొమ్మినేని రామయ్య, పసుమర్తి కాశీ, చాల్లా ఆంజనేయులు, గుంటుపల్లి వెంకటయ్య, శ్రీకాంత్, అర్చకులు మణికంఠ శర్మ, అయ్యప్ప భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్ సాయం

### 129 మంది లబ్ధిదారులకు రూ.36.13 లక్షల చెక్కుల పంపిణీ

### అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ అండగా నిలుస్తాం: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్





**నిర్మల్ - భైంసా: అక్టోబర్ 04 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే తన లక్ష్యమని చెప్పారు.భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీస్‌లో 129 మంది లబ్ధిదారులకు రూ.36.13 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 5 వేల మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. పేద కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భారీగా వైద్య ఖర్చులు చేయాల్సి వచ్చినప్పుడు సీఎంఆర్ఎఫ్ కొంతమేర ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ సాయానికి అర్హత ఉన్న ఎవరైనా తనను నేరుగా సంప్రదించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, సంబంధిత ప్రక్రియ కోసం తన కార్యాలయంలో ఇద్దరు సహాయకులు నిరంతరం అందుబాటులో ఉంటారని చెప్పారు.

ముధోల్ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసి అర్హులకు సాయం అందించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి, సీనియర్ నాయకులు సోలంకి భీంరావు,సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పండిత్‌రావు పటేల్,బీజేపీ పట్టణ మండల అధ్యక్షుడు రావుల రాము,సిరం సుష్మారెడ్డి,యేశాల దత్తాత్రి, సాయన్న,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు అప్పాల రాకేష్, సాయినాథ్ తదితరులు అన్నారు.

విద్య, వైద్యం, సాగునీటితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, బీజేపీ నాయకులు,కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రేగళ్ల భూములకు పట్టా హక్కులు కల్పించాలి

### - కేటీపీఎస్, నవభారత్ సీఎస్ఆర్ ఫండ్ తో రేగళ్ల పెద్దతండా అభివృద్ధి చేయాలి

### - గ్రామాన్ని దత్తత తీసుకుని సమగ్ర అభివృద్ధి చేపట్టాలని మంత్రి పొంగులేటికి సర్పంచ్ లావుడ్యా పూర్ణ నాయక్ వినతి



**కొత్తగూడెం, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి)**
లక్ష్మీదేవిపల్లి మండలం, రేగళ్ల పెద్దతండా పరిధిలో గిరిజన, పేద కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా భూ హక్కులు, పట్టాలు, భూ రికార్డుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తెలిపారు. రేగళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశంలో లావుడ్యా పూర్ణ మాట్లాడుతు అర్హులైన గిరిజన కుటుంబాలకు భూ హక్కులు కల్పించడంతో పాటు పోడు భూముల సమస్యలు, పట్టాల మంజూరు, భూ రికార్డుల సవరణ, భూముల సర్వే, హద్దుల నిర్ధారణ వంటి అంశాలను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ప్రత్యేక రెవెన్యూ సర్వే నిర్వహించి భూ సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి పరిష్కరించాలని, భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడం ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు, రుణాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేటీపీఎస్, నవభారత్ సంస్థల సీఎస్ఆర్ నిధులతో రేగళ్ల పెద్దతండా గ్రామపంచాయతీని దత్తత తీసుకుని సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని, రేగళ్ల పెద్ద తండా గ్రామపంచాయతీలో ప్రధానంగా గిరిజన కోయ, లంబాడ కుటుంబాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలు నివసిస్తున్నాయని, గ్రామం కేటీపీఎస్ విద్యుత్ కేంద్రానికి సుమారు నాలుగు కిలోమీటర్లు, నవభారత్ పరిశ్రమకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. పారిశ్రామిక కార్యకలాపాల కారణంగా ఫ్లైయాష్, దుమ్ము తదితర పర్యావరణ ప్రభావాలపై గ్రామ ప్రజల్లో ఆందోళనలు ఉన్నాయని తెలిపారు.

**మౌలిక వసతులు కల్పించాలి**

సీఎస్ఆర్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు, మందులు అందించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం, గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేపట్టడంతో పాటు ఫ్లైయాష్, దుమ్ము ప్రభావాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఇతర ప్రజా సదుపాయాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ఉమ్మడి రేగళ్ల పంచాయతీని స్పెషల్ డ్రైవ్ గా చేపట్టి 100 శాతం ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని, ఐటీడీఏ నుండి గిరిజన తండాలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేసేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కేటీపీఎస్, నవభారత్ సంస్థల సీఎస్ఆర్ నిధులతో రేగళ్ల పెద్దతండాకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ మంజూరు చేయడంతో పాటు గ్రామాన్ని దత్తత తీసుకునేలా సంబంధిత సంస్థలు, అధికారులతో సమన్వయం చేయాలని కోరారు. ఈ అంశాలను స్పష్టంగా తెలుపుతూ వినతి పత్రాన్ని మంత్రికి అందించారు. సర్పంచ్ వినతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే నిధులు మంజూరు చేసి గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# తూప్రాన్‌లో రూ.400 కోట్లతో అమూల్ డెయిరీ ప్లాంట్

### 18 నెలల్లో నిర్మాణం పూర్తి.. రైతులకు అదనపు ఆదాయం, మహిళలు-యువతకు ఉపాధి




**తూప్రాన్, అక్టోబర్ 4 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభ్యున్నతి సాధ్యమని, తెలంగాణలో శ్వేత విప్లవం 2.0ను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్లతో ఏర్పాటు చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్‌కు ఆదివారం భూమిపూజ చేశారు.



ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేసి పాడి రైతులకు అదనపు ఆదాయం కల్పించడంతో పాటు స్థానిక మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రైతుల నుంచి పాలు సేకరించి ఇక్కడే ప్రాసెసింగ్ చేసి పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పన్నీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి తదితర ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు చెప్పారు. సహకార సంఘాల ద్వారా దళారుల దోపిడీని అరికట్టి రైతులకు మెరుగైన ధరలు అందించవచ్చన్నారు.

శ్వేత విప్లవం 2.0లో భాగంగా 2029 నాటికి దేశవ్యాప్తంగా 75 వేల కొత్త పాడి సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగాపెట్టుకున్నట్లుతెలిపారు.తెలంగాణలో1,525 కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతు బలపడితేగ్రామం,తెలంగాణ,దేశంబలపడతాయని అన్నారు.

మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ అమూల్ ప్లాంట్‌తో నాణ్యమైన పాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ పథకాలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ డెయిరీ పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తుందని, యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

మెదక్ ఎంపీ ఎం. రఘునందన్‌రావు మాట్లాడుతూ మెదక్ జిల్లాలో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో తూప్రాన్‌లో అమూల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాడి పరిశ్రమ ద్వారా రైతులకు రోజువారీ ఆదాయం లభించి ఆర్థికంగా బలోపేతం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.